'నువ్వు మా అమ్మవి కాదు'

[కథానిక]

✽

= శ్రీ చోడవరపు బాబూరావు =

'ఇంతకూ మీ రనే దేమిటి?' అ నడిగింది విశాలాక్షి, భర్త శ్రీధరరావుని. ఆ అడగటంలో కొంచెం దురుసుతనం, ఎప్పుడూ తన కోర్కెకు తిరుగులేనటువంటిది ఈనాడు వుండటంవల్ల కలిగే రోషం వ్యక్త మవుతున్నై.

'నన్ను చూసి కాకపోయినా ఆ పసిగుడ్డుని చూసైనా నీమతం మార్చుకోమంటున్నాను' అన్నాడు శ్రీధర్. అట్లా అనగటంలో కేవలం నిరాశమాత్రమే తొంగిచూస్తున్నది.

'అయితే భర్తకీ పిల్లలకూ సేవచేస్తూ కూర్చోటమే ఆడదాని జన్మకి పరమావధి అనుకుంటున్నారా?'

'నే నెట్లా అనుకుంటున్నా, ఇన్నాళ్లనుంచీ ఇద్దరమూ ఎట్లాగో అట్లా సర్దుకుపోతున్నాం. ఇప్పుడు—'

'ఊఁ—ఇప్పుడుమాత్రమే మొచ్చింది?'

'ఆ పిల్లవాడి సంరక్షణసంగతే!'

'దాది నెవర్నైనా పెట్టుకుందా మని ఇందాకే చెప్పానుగదా?'

'అయితే తల్లీ, తండ్రీ బతికుండికూడా పిల్లవాణ్ని పరాయివాళ్ల చేతుల్లో—'

'మీ రనేది నాకేమీ అర్థ మవటల్లేదు'

'అవును, నీ కర్థం కాదు, నాకు తెలుసు. నిన్నిట్లా అడగటంవల్ల ఫలితంకూడా శూన్య మని తెలుసు. అయినా, కళ్లైనా తెరవని ఆ పసిగుడ్డుని చూసి అడక్కుండా వుండలేక పోతున్నాను. వాణ్ణి నువ్వెట్లా వదిలిపెట్టి వుండగలవో గాని—' శ్రీధర్ కళ్లు కొంచెం చెమ్మగిలినట్లు అనుమానం.

'మరి నాకంటె ఎక్కువ ప్రేమ వాడియందు మీ కుండటం మరీ విచిత్రం'

'నిజంగా నా కున్నంత ప్రేమకూడా నీకు లేక పోవటం విచిత్రమైన విషయమే.'

'నాపొట్ట నేను పోసుకుంటుంటేకూడా అడ్డుపడే మీ తెలివితక్కువకి నవ్వాలో ఏడవాలోకూడా నా కర్థం గాకుండావుంది'

'నీ కంత అవసరం ఎందుకొచ్చిందో నాకూ అర్థం గావటల్లేదు'

'స్త్రీ భర్తసంపాదనమీద ఆధారపట్టంవల్లనే గదా ఇంత లోకువైంది? భర్త ఎన్నికొట్టినా తిట్టినా స్త్రీ తన కాళ్లమీద తను నిలబడలేక పోవటంవల్లనే సహించ వలసివస్తోంది'

'అయితే నన్నుకూడా అటువంటి తుచ్ఛుల్లోనే లెఖ్ఖ వేస్తున్నావన్నమాట!'

'నే నలా గనలేదు. స్త్రీకి ఆర్థికంగా స్వతంత్రం వుండా లంటున్నాను'

'మరి పిల్లలగతి యేమవ్వా లని నే నడుగుతున్నాను!'

'ఏం? తల్లి మాత్రమే బాధ్యురాలా?'

'కాదు, ఇద్దరూ బాధ్యులే! ఇద్దరిలో ఏ ఒక్కరు తప్పిపోయినా పిల్లలగతి చెప్పరానిస్థితి కొస్తుంది'

'మీతో ఇహ వాదించటానికి నాకు టైంకూడా లేదు. చెపుతున్నా వినండి. మీ కంతగా తాపత్రయంగావుంటే మీరే సంరక్షించుకుంటారో, దాదినే పెట్టుకుంటారో, ఇంకేం చేసుకుంటారో నా కవసరం లేదు. నేనుమాత్రం స్కూల్ మిస్ట్రెస్ వుద్యోగాన్ని ఒదులుకోలేను' అని విశాలాక్షి గబగబా స్లిప్పర్సు తొడుక్కుని వీథిలోకి వెళ్లి పోయింది.

ఆమె పోయిన దిక్కు చూస్తూ నుంచుండి పోయాడు శ్రీధర్.

౨

రాఘవరావు రోజూ ఆఫీసునుంచి రాగానే భార్య సుభద్రమ్మ వచ్చి కోటందుకుని ఒంకన తగిలించటం, కాళ్లుకడుక్కునేటందుకు నీళ్లూ, మంచినీళ్లూ ఇవ్వటం అలవాటు. ఆ నాడుమాత్రం రాఘవరావు వచ్చేసరికి కొంచెం ఆశ్చర్యం వేసింది. సరాసరి లోపలికి వచ్చి చూస్తే, భార్య ఎవరో చిన్నపిల్లవాడికి అన్నం కలిపి నోట్లో పెట్టటం చూసేసరికి మరింత ఆశ్చర్యం వేసింది. ఆమె ఇటువైపే చూడకుండా ఆపిల్లవాణ్ని లాలిస్తూ, బుజ్జగిస్తూ అన్నంకలిపి నోట్లో పెట్టటం చూస్తే అతనికి నవ్వుకూడా ఒచ్చింది.

ఇట్లా ఎంతసేపో కాకముందే ఆ పిల్లవాడు రాఘవరావుని చూసి, దృష్టి మార్చకుండా ఏకదీక్షగా చూట్టం మొదలుపెట్టేసరికి సుభద్రకూడా వెనక్కు చూసి, చిన్న నవ్వుతో—

'అబ్బాయి మిమ్మల్ని చూసేవరకూ నేనకూడా చూడలేదు సుమండీ?' అంది.

'ఎవరా అబ్బాయి?'

'మనింటిపక్క శ్రీధరరావుగారు లేరూ?'

'ఓ—హో! వాళ్లబ్బాయా? నీదగ్గిరెట్లా మచ్చికైనాడూ? అయినా ఎవరైనా చిన్నపిల్లలు కనిపిస్తే ఒదిలిపెట్టవులే. రోజూ కోటందుకునేదానివి ఇవాళ కనపడకపోయేసరికి నీకూకూడా "సమాన హక్కుల" వాసనేమైనా తగిలిందేమో అనుకున్నా' అని రాఘవరావు నవ్వితే, సుభద్రకూడా నవ్వొచ్చింది.

'ఆ, ఏం లేదండి! నేను కోసు కుట్టుకుంటుంటే ఈ అబ్బాయి ఎందుకో గుక్కపట్టి ఏడుస్తున్నట్లు వినపడింది. వాకిట్లోకెళ్లి చూద్దునుగదా, అప్పి-దాదిగావును-దానిచేతుల్లో నిలవకుండా మెలికలు తిరుగుతూ ఏడుస్తున్నాడు. దాన్ని పిలిచి అబ్బాయిని రమ్మని చేతులు చాపేసరికి ఒక్కక్షణం చూసి చేతుల్లోకి దూకాడు. చూడండి, ఎట్లా ముద్దుముద్దు మాటలడుతున్నాడో!' అని ఒక్కసారి బుగ్గలు నిమిరింది.

'మరే, ఆయనభార్య ఈ అబ్బాయిసంగతేమీ పట్టించుకోదనుకుంటాను'

'అదేమిటండీ? ఎక్కడో మేష్టరీ చేస్తున్నదటగా? పిల్లాణ్ని పరాయిచేతుల్లో పెట్టి తను వుద్యోగం చేస్తూ వూరూరా తిరుగుతుండా యేమిటి?'

'సరే, మన మిట్లా అనుకుంటూంటామా? ఆయన భార్యయేమో స్త్రీలుకూడా పురుషులమల్లే యెందుకుండకూడదు, ఇద్దరికీ సమానమైన స్వేచ్ఛ వుండాలి— అని ఈ విధంగా చెబుతుందిట'

'సరే. ఏం చెబితే మనకేం గాని, కాసేపట్లో చూడండి, ఎంతచనువైనాడో! ఇందాకా 'ఆ విశాలాక్షమ్మగారు వచ్చారు, పిల్లవాణ్ణివ్వ'మని దాది ఒస్తే, అబ్బాయి దాదిదగ్గరకు వెళ్ల లేదుసరి కదా, నన్ను గట్టిగా కావిలించుకుని ఏడవటం మొదలెట్టాడు!'

'ఇంకేం, నీకూకూడా పిల్లల్లేని విచారం తీరి పోయిందిలే. సరే, అబ్బాయిధోరణిలో పడి, మొగుడనేవాడొకాడున్నాడన్న సంగతే మరిచిపోయినావల్లే వుందే. ఇందాకనంగా ఒస్తే మంచినీళ్లు కావాలనైనా అడగలేదు?' అనేసరికి నవ్వుతూ సుభద్ర పిల్లవాణ్నెత్తుకునే వంటింట్లోకి పోయింది.

౩

కలెక్టరాఫీసునించి శ్రీధరరావూ, గరల్సు స్కూలునించి విశాలాక్షీ ఒక్కసారే ఒచ్చారు. ఒచ్చి

గుమ్మంలో తారసిల్లారు. ఇల్లు తాళం వేసి వుంది. అయితే తాళంచెవి ఒకటి శ్రీధర్‌దగ్గిరా, ఒకటి విశాలాక్షిదగ్గిరా వుండటంవల్ల ఇబ్బం దేమీ కలగటంలేదు. శ్రీధర్ తాళం తీసి లోపలికి వెళ్లాడు. విశాలాక్షికూడా సరాసరి లోపలికి వెళ్లిపోయింది.

స్లిప్పర్లు విడిచి, దాది కాఫీహోటలునుంచి తెచ్చిన కాఫీ ఫ్లాసుక్కులోంచి కప్పులోకి ఒంచి తాగుతూండగా, భర్త వాకిట్లోంచి ఎవర్నో పిలుస్తున్నట్లు వినపడింది విశాలాక్షికి. ఎవర్నా అన్నట్టు అటు తిరిగేసరికి, శ్రీధర్ అప్పిని కేకేస్తున్నాడు. కాసేపట్లో అప్పి వచ్చి పిల్లవాణ్ని శ్రీధర్‌కి అందించింది. శ్రీధర్ పిల్లవాణ్ని కాసేపు ఎత్తుకొని, ముద్దులాడి, మళ్లా అప్పికి ఇచ్చేశాడు. అది పిల్లవాణ్ని తీసుకుని వెళ్లిపోగానే శ్రీధర్ లోపలికి వచ్చేశాడు.

ఇదంతా చూసిన విశాలాక్షికి మనస్సులో ఎలాగో అనిపించింది. మొట్టమొదటిరోజుల్లో పిల్లవాడు కనపడకపోయినా విశాలాక్షి అంత పట్టించుకోలేదు. తరువాత కొన్నాళ్లకి పిల్లవా డసలు కనపడకపోయేసరికి అప్పి నడిగింది. అది, పక్కయింటి సుభద్రమ్మతో ఆడుకుంటున్నా డని చెప్పింది. మెదలకుండా వూరుకుంది విశాలాక్షి. కాని ఇవాళ భర్త చేసిన ప నేమిటి? ఇవాళేనా, రోజూ ఇంతేనా? శ్రీధర్‌మీద అమితమైన కోప మొచ్చింది విశాలాక్షికి.

'అక్కడికి పిల్లవాడు నా కేమీ కానట్టూ, తనకే కొడుకైనట్టూ! ఓయబ్బో, ఇంతమాత్రంచేత నాకన్నా యెక్కువని అనుకుంటున్నారు కాబోలు' అని రుసరుస లాడుకుంటూ కాఫీకప్పు అక్కడే పడేసి, వాకిట్లోకి వెళ్లి 'అప్పీ! అప్పీ' అని పిలిచింది.

వినపడకపోవటంవల్ల అప్పి మొదట పలకలేదు. తరవాత వినపడేసరికి 'ఆ!' అని ఒక్కగంతులో ఒచ్చింది.

'ఎక్కడున్నావ్?'

'సుభద్రమ్మగారింట్లో'

'ఎప్పుడూ అక్కడే వుండమని ఎవరు చెప్పారు నీకు? పిల్లవాడేడీ?'

'ఆ అమ్మగారిదగ్గర్నే వున్నాడండి'

'అట్లాగా? ఆ అమ్మగారి కున్నంత ప్రేమ కూడా నాకు లేకపోయిందేం? అంత వూళ్లోవాళ్ల చేరదీసి పెంచవలసిన స్థితి ఇంకా అబ్బాయికి రాలేదని చెప్పు, పో, ముందు అబ్బాయి నిట్లా తీసుకురా'

అప్పి వెళ్లింది.

తనకు భర్తమీద వచ్చిన కోపం, అప్పిమీద ఒచ్చిన కోపం, చివరికి సుభద్రమ్మమీద ఒచ్చిన కోపం-వీ టన్నిటికీకూడా కారణం కొడుకుమీది ప్రేమే నని ఆమెకు తెలీదు. బయటికి కనపడకపోయినా, తాను ఎంత చంపుకోటానికి ప్రయత్నించినా ఇంకా ఏమూలో దాగివున్న పుత్రప్రేమే ఈ భర్తమీదా, తక్కినవాళ్లమీదా కోపంగా పరిణమించిందని ఆమె గ్రహించలేకపోయింది.

అప్పిని చివాట్లు పెడుతున్నప్పుడు విన్న సుభద్రమ్మ, అది మళ్లా అబ్బాయికోసం రాగానే, 'ఇదుగోనే' అని ఒక్కసారి గట్టిగా పిల్లవాణ్ని ముద్దుపెట్టుకుని ఎందుకో కంట తడితో పిల్లవాణ్ని అప్పికిచ్చేసింది. మొదట్లో సుభద్రమ్మ చంకలోంచి ఎంత గుంజినా పిల్లవాడు రాలేదుగాని, తరవాత తప్పనిసరిగా ఏడుస్తూ అప్పిదగ్గరకు వెళ్లాడు.

౪

'ఇవాళ అబ్బా యెక్కడా కనపళ్లేదేమి?' అ నడిగాడు రాఘవరావు ఆఫీసునించి రాగానే.

'వాళ్లసలు వూళ్లో లేరు. ట్రాన్స్‌ఫ రయిందిట'

'ఎవరికి?'

'శ్రీనరరావుగారికి. ఆ దేదో వూరు ట్రాన్స్‌ఫరయిందనీ, విశాలాక్షికూ డా ఆ వూరే ట్రాన్స్‌ఫరయిందనీ, వాళ్లంతా ఆవూరే వెడతారనీ నిన్న అప్పి చెప్పింది.'

'అట్లాగా—' అని వూరుకున్నాడు రాఘవరావు.

'ఇవా ళేమీ తోచటల్లేదు, చూశారో లేదో!'

'నిజమే'

'మధ్యాహ్నం అన్నంకూడా సయించలేదు. అబ్బాయిని దగ్గిర కూచోపెట్టుకుని అన్నం తినేదాన్ని రోజూ. ఇవాళకూడా మామూలుగానే అన్నం కలిపి ముద్దచేసి అబ్బాయి పక్క నున్నాడనుకుని పెట్టబోయాను. మళ్లా జ్ఞాపక మొచ్చింది.'

'నేను మొదట్లోనే చెప్పలేదూ, అంతగా అలవాటు చేసుకుంటే తరవాత మనకే కష్ట మని?'

'సరే, ఇప్పు డిట్లా అంటున్నారుగాని మీరు మాత్రం ఇంట్లో వున్న కాసేపూ అబ్బాయిని ఒదిలిపెట్టేవారా యేమిటి? ఎప్పుడూ దగ్గిర కూచోపెట్టుకుని కబుర్లు చెప్పేవారుకదూ?'

'ఏమోగాని, అయినా, నీఅంత అలవాటు లేదు నాదగ్గిర'

'లేకేం? అబ్బాయి లేకపోతే మీకుమాత్రం దిగులుగా లేదూ? ఎప్పుడూ ఏదో పరధ్యానంగా వుండటం—!'అదోమాదిరిగా చూసింది సుభద్ర భర్త వైపు. ఆమె అన్నమాట నిజమైనా, ఓ ఆడదానికి మల్లే తనుకూడా దిగులుపడ్డానని ఒప్పుకోవటం చిన్నతనంగా తోచిం దతనికి.

'అబ్బే—పరధ్యానం లేదూ ఏమీలేదు' అని తప్పించుకున్నాడు.

'సరేగాని, ముందు స్నానం చెయ్యండి, తరువాత మాట్లాడుకోవచ్చు' అని సుభద్రమ్మకూడా ఆచర్చ అంతటితో ఒదిలేసి నీళ్లు తోడటానికి దొడ్లోకి వెళ్లింది.

కాని సుభద్రకు మనస్సంతా ఆ పిల్లవాడిమీదే వుంది. రాఘవరావుకు భోజనం వడ్డిస్తూ—

'నే నోమాట చెపుతాను వింటారూ?' అన్నది.

'ఏమిటి?' అన్నట్లు తల పైకెత్తి చూశాడు రాఘవరావు.

'పోనీ—మీరుకూడా ఆవూరు ట్రాన్స్ఫరు చేయించుకోరాదూ?'

'నీ చాదస్తంగాని, ఎవరిపిల్లాడికోసమో ఇంత అలమటించిపోవట మేమిటి? వాళ్లున్న చోటల్లా మనం వుండటం సాధ్యపడుతుందా? ఇహ మన జన్మ కింతే ననుకుని వూరుకోవటంతప్ప మ రేదారీ లేదు'అని చెబుతుంటే రాఘవరావుస్వరం గద్గదికమైంది. సుభద్రమ్మ కళ్లల్లోంచి నీటిబొట్లు జారినై.

'ఏమైనాగానీ ఆ అబ్బాయిని చూడందే వుండలేనండీ! 'అమ్మా, అమ్మా'అంటూ చేతులు జాపుతూ పరిగెత్తుకొచ్చేవాడు!'

'నువ్వు విన్నావో లేదోగాని, నన్ను 'నాన్నా' అనికూడా పిలవటం మొదలెట్టాడు. నేనే ఓసారి,'తప్పు నాయినా, నేనుకాదు మీ నాన్నని' అంటే, 'కాదు, నువ్వే మానాన్నవి' అని, అవు ననేవరకూ ఒదిలిపెట్టాడుగాదు.'

'నాకు తెలీదుటండీ! అస లా అబ్బాయిని మొదట్నుంచీ తల్లి చేరదియ్యకపోవటంవల్ల ఇంతవర కొచ్చింది.'

'పోనీ, తల్లి గాకపోతే తండ్రిమాత్రం చేరదియ్యగూడదూ?'

'అయ్యో, మీకు తెలీదుగావును! ఆయనకి మహాఆపేక్ష అబ్బాయంటే. రోజూ ఆఫీసునుంచి రాగానే ఇక్కణ్నుంచి అప్పిని, అబ్బాయిని తీసుకు రమ్మని పిలిచి, కాసేపు ఎత్తుకు తిరిగేవాడు.'

'ఆ విశాలాక్షమ్మ అస లెప్పుడూ పిలవనన్నా పిలవదల్లే వుందే?'

'పిలవనూ పిలవదు, పిలిచినా దగ్గిరికి వెళ్లనూ వెళ్లడు పిల్లవాడు. భగవంతుడు, కావాలో కావాలో అనుకునేవాళ్ల కివ్వకుండా—' ఇహ మాట్లాడలేక పోయింది సుభద్రమ్మ. రాఘవరావుకూడా చేతులో ముద్ద నోట్లో పెట్టుకోలేక విస్తట్లోనే వదిలేసి కూర్చున్నాడు.

అట్లా ఇద్దరూ రెండు నిముషాలపాటు మాటా మంతీ లేకుండా కూచున్నతర్వాత—

'సరే, ఇప్పు డూరికే విచారిస్తే యేంలాభం? కాసిని మజ్జిగ—' అనగానే సుభద్రమ్మ పమిటచెంగుతో కళ్లు తుడుచుకుంటూ మజ్జిగ కాసిని పోసి—

'అయ్యో—నా మందమతి కాల! మాటల సందట్లో పడి మీకు పులుసొయ్యటం మరిచేపోయా' నంటే—

'నా కసలు సరిగా ఆకలి లేదులే. మజ్జిగే పొయ్యి' అని కాస్తఅన్నం తిని చెయ్యి కడుక్కున్నాడు.

రాఘవరావు లేచింతర్వాత సుభద్రమ్మకూడా ఏదో భోజన మయిందంటే అయిం దనిపించుకోటానికి మాత్రం కాస్త ఎంగిలిపడి మూతి తుడుచుకుంది.

౫

'అబ్బాయిగారికి ఒళ్లు కొంచెం వెచ్చగా వుందండీ' అని చెప్పింది అప్పి, విశాలాక్షి ఇంటికి రాగానే.

విశాలాక్షి పిల్లవాణ్ని దగ్గరికి తీసుకోబోతే వాడు కెవ్వుమని గావుకేకపెట్టి అప్పికంఠం గట్టిగా బిగించి ఏడవటం మొదలెట్టాడు ఇటు చూడకుండా. విశాలాక్షి పిల్లవాడి ఒంటిమీద చెయ్యేసి చూస్తే ఒళ్లు మండిపోతున్నట్లు కనిపించింది.

'కాస్త వెచ్చగా వుండటమేమిటే? మసిలి పోతుంటేనూ! అయ్యగారింకా రాలేదూ—' ఆ మాట అంటూ కొంచెం నాలుక కొరుక్కుంది.

'ఒచ్చి అబ్బాయిగారిని చూసి డాక్టరుగారి కోసం వెళ్లారు' అన్నది అప్పి.

విశాలాక్షిమనస్సు పరిపరివిధాల పోయింది. పిల్లవాడి ఒంటిమీద చెయ్యి వేస్తే తన చేతికి తగిలిన వేడి తన నరనరానికీ వేడి కలిగించింది. ఆమె ఒళ్లంతా ఒక్కసారి జలదరించింది. మళ్ళా ఓసారి పిల్లవాణ్ని దగ్గరకు తీసుకోబోతే, రాక్షసిని చూసినట్టు కేక వేసి ఏడవటం మొదలుపెట్టాడు.

ఇంతలో శ్రీధర్ డాక్టరుతో సహా ప్రత్యక్షమైనాడు. డాక్టరు పిల్లవాడి చెయ్యి చూసి, 'జ్వరం ఎప్పట్నుంచీ?' అనడిగాడు.

'ఎప్పట్నుంచీ ఎక్కడండీ? నిన్ననే ఈ వూళ్ళో దిగాం. రాత్రి కొంచెం నలతగా వుంటే ఏదో ప్రయాణంవల్ల ననుకున్నాం. ఇవాళ జ్వరం పేలిపోతూ ఒచ్చేసింది.'

'అట్లాగా! అయితే అక్కడ అబ్బాయి ఎవరి దగ్గిరైనా బాగా చనువుగా వుండేవాడా?'

శ్రీధరరావు విశాలాక్షివైపు చూశాడు. విశాలాక్షిమాత్రం ఇటువైపు చూట్టంలేదు. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తోంది.

'అవునండి'

'అయితే వార్ని పిలిపించటంకన్న మంచి వుపాయం మరొకటి లేదు. శరీరంలోమాత్రం జబ్బు రాదగిన లోపేమీ కనపట్టంలేదు' అని వెళ్లిపోయినాడు డాక్టరు. ఆయన ఇదివరకిటువంటి కేసులు చాలా పట్టినవాడే.

'డాక్టరు చెప్పిందంతా విన్నావా?' అన్నాడు శ్రీధర్.

'ఆ—'

'ఇప్పుడేం చెయ్యాలి?'

'చేసే దేముంది? అయినా అసలా సుభద్రమ్మ దగ్గిర వాణ్నెందు కలవాటుచెయ్యాలి?'

'ఎటొచ్చీ నామీదికే ఒస్తావే! అయినా ఒహరలవాటుచేసేదేమిటి?'

'అప్పి వాణ్ని ఆవిడదగ్గరికి తీసికెడుతుంటే మీ రెందు కూరుకోవాలి?'

'అయితే వూరుకోకూడనివాణ్ని నేనే నన్న మాట.'

'మీ చేతులారా మీరే ఇచ్చి పంపుతుంటే నేను లక్షమార్లు చూశాను.'

'చూసినప్పుడు నాదగ్గర్నుంచి నువ్వే లాక్కోలేకపోయినావూ? ఇదుగో! చెపుతున్నా విను. అనవసరంగా కంఠశోషపడినంతమాత్రాన లాభం శూన్యం. మాతృహృదయం పసిపిల్లలు బాగా గుర్తిస్తారు. ఆ సుభద్రమ్మకు పిల్లల్లేకపోయినా ఆవిడలో వున్న మాతృత్వమే, దానికి వాచిపోయిన మన పిల్లవాణ్ని ఆకర్షించింది తెలుసా?'

పూచలాగ తగిలింది విశాలాక్షి కీమాట. కీచుమని పోయింది ఒక్కసారిగా. మనస్సంతా కలికేసినట్లయింది. సమాధానమేమీ చెప్పక తిరిగి వెళ్లిపోయింది.

మర్నాడు పిల్లాడికి జ్వరం మరింత హెచ్చై, పలవరింతలతో సహా ఒచ్చింది. విశాలాక్షి పిల్లాడిదగ్గరికి ఒచ్చేసరికి, ‘అమ్మా’ అని కలవరిస్తున్నాడు.

‘ఏంకావాలి నాయినా?’ అంది విశాలాక్షి.

‘అమ్మ కావాలి’

‘ఇదుగో! నేనే అమ్మని, ఇటు చూడు.’

పిల్లవాడు ఇటు చూసి, కళ్లు మూసుకుని ఏడుస్తూ, ‘నువ్వుకాదు మా అమ్మని.’ అమ్మే కావాలి’ అని మూలగటం మొదలెట్టాడు.

భార్యాభర్తలు ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. ఇంతలో డాక్టరొచ్చి మందిచ్చి—

‘వారికి రమ్మని వుత్తరం రాశారా?’ అన్నాడు.

‘ఎవరికి?’

‘పిల్లవాడి కెవరిదగ్గిరో చను వెక్కువన్నారే?’

‘లే—దు’ అన్నాడు శ్రీధర్ తల వంచుకుని.

‘మీకు అబ్బాయి బతకటం ఇష్టంలేనట్లుంది!’

శ్రీధర్ బాధ భరియించ లేకచేత్తో హృదయం గట్టిగా నొక్కుకున్నాడు.

‘చూడండి! నేనిట్లా అంటున్నానని మీరేమీ అనుకోవద్దు. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. తక్షణం టెలిగ్రా మివ్వండి. నామందులుమాత్రం ఏమీ పనిచెయ్యవని ఇప్పుడే చెబుతున్నా. మీ యిష్టం’ అని వెళ్ళిపోయినాడు.

మళ్ళా ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు భార్యాభర్తలు!

‘బాబుగారూ! నామాట విని టెలిగ్రా మివ్వండి. పిల్లవాణ్ని చేతులారా ఎందుకు చంపుకుంటారు!’ అన్నది అక్కడే వున్న అప్పి.

౬

‘రాత్రి ఏమిటో చాలా చెడ్డ కలొచ్చిందండీ’ అన్నది సుభద్ర భర్తతో.

‘నీకెప్పుడూ ఏదో ఒకాటి ఒస్తూనేవుంటుంది.’

‘అట్లా కాదండీ. ఇవాళ మన సెట్లాగో వుంది. అబ్బాయిని చూసి ఎన్నాళ్లో అయింది.’

‘అయితే ఇప్పు డక్కడకు తీసుకుపొమ్మంటావా యేమిటి?’

‘వెళ్ళి ఒక్కసారి చూసొద్దాం.’

‘నీకేమైనా పిచ్చా? ఇందుకోసం తీరా పనికట్టుకు వెడితే వాళ్లేమైనా అనుకుంటారేమో నసైనా ఆలోచించవేం?’

‘ఏమీ అనుకోరు’ అని మునిసాలుకమీదినించి అన్నదేకాని ఆమెకూడా మనస్సులో అనిపించక పోలేదు. కాని పిల్లవాణ్ని చూడాలన్న కాంక్ష ఆమెలో వున్న ఆ అనుమానాన్ని కప్పేసింది.

‘ఏదో చెడ్డ కలొచ్చినంతమాత్రాన ఇట్లా రాద్ధాంతం చేస్తూ కూర్చుంటే యెట్లా? ఇప్పుడు మనం వెళ్లాలంటే మాటలా? నాకు సెలవు దొరకటం ఓ దుర్లభం. ఇంతకీ ఏమి టాకల?’

‘అబ్బాయి నెవరో రాక్షసు లెత్తుకుపోతున్నారుట. అమ్మా అమ్మా అని యేడుస్తూ అబ్బాయి రానంటున్నాడుట. విశాలాక్షమ్మ అందుకోబోతే రాక్షసులు ఒదల్లేదుట. ఇంతలో నేనే వెళ్లాను. అబ్బాయి ఒస్తానని యేడుస్తున్నాడు. వెంటనే మెలుకువ ఒచ్చేసింది.’

‘స—డేలే. ఇటువంటి కల లెప్పుడూ ఒస్తూనే వుంటై. నాకుమాత్రం రావూ అప్పుడప్పుడూ? రాత్రి నాకూ ఇటువంటిదే ఓ కలొచ్చింది. ఇహ కలొచ్చినప్పుడల్లా ఏదో వూరికి పనిగట్టుకుపోవాల్నం?’ అని ఏదో అంటున్నాడేగాని రాఘవరావు మనస్సుకూడా ఇక్కడ లేదు. రాఘవరావు సుభద్రమ్మని చూస్తే ఆమెకళ్లంట నీళ్లుకారినట్టు కనిపించింది. సుభద్రమ్మ రాఘవరావుని చూసి అతని మనస్సుకూడా పూర్తిగా చదివేసింది.

అక్కణ్ణుంచి వెంటనే లేచి, భుజంపట్టుకు వూపుతూ—

‘తప్పకుండా వెడదామండీ! ఇట్లా ఒస్తున్నామని ఓ వుత్తరం రాసిపడేసి ఇవ్వాళే బయల్దేరదాం’

అంటుండగా ఎవరో ఎర్రసైకిలుమీద వచ్చివాకిట్లోంచి కేకవేశారు. రాఘవరావు గబగబా వెళ్ళి చూస్తే పోస్టుజవాను!

'టెలిగ్రాం, సంతకం' అంటూ ఓకవరు అందించాడు. రాఘవరావు వణికే చేతుల్తో గబగబా సంతకం పెట్టి కవరు విప్పి చదివాడు:

'అబ్బాయి మరణశయ్యపై వున్నాడు. ఉన్నపాటుగా బయల్దేరిరావలసింది'

౭

'అమ్మా—అమ్మా'

'ఇదుగో నాయినా—ఇక్కడే వున్నా'

కళ్ళు మెల్లిగా తెరిచి ఆమెవంక చూసి వులిక్కిపడి యేడవటం మొదలెట్టాడబ్బాయి.

'నువ్వు కాదు మాఅమ్మవి. నువ్వు దెయ్యానివి, అమ్మ కావాలి' అని యేడవటం మొదలెట్టాడు.

'ఇదుగో.—నిన్ను చూస్తేనే పిల్లవాడు భయపడి పోతున్నాడు. ముందు నువ్వవతల కెళ్లు'అని శ్రీధరరావు వచ్చి పిల్లవాడిమీద చెయ్యివేసి దగ్గరగా కూర్చున్నాడు.

తనను చూస్తేనే పిల్లవాడు భయపడిపోతున్నాడు! విశాలాక్షమ్మకు తనను నుంచోబెట్టి నిలువునా దహించివేస్తున్నంత ఆవేదనగా వుంది. తన కొడుకు తనను చూసి పెద్దపులిని చూసినట్లుగా భయపడుతున్నాడు! తనేనా దీని కంతటికీ కారణం? 'నువ్వు మాఅమ్మవు కాదు'అని పిల్లవాడు కలవరించటంలో ఎంతఅర్థం ఇమిడివుంది? ఆ అర్థం ఆ అబ్బాయికే తెలిసినంతగా తనింకా తెలుసుకోలేకపోతోంది.

'అమ్మా—అమ్మా'

'అమ్మ ఇప్పుడే వస్తుంది యేడవకమ్మా'

'నువ్వు మాఅమ్మవు కాదు. దెయ్యానివి. నాకు అమ్మే కావాలి'

'దెయ్యం అవతల కెళ్లిపోయిందిలే నాయనా. చూడు, నేను నాన్నని'

ఏడవకుండా కళ్ళుమూసుకుని పడుకున్నాడు పిల్లవాడు.

త నెంతదూరంగా వుంటే పిల్లవాడి కంత నిర్భయం, నిర్విచారం! తను తల్లికాదు, దెయ్యం! పిల్లవాడి కీ సంగతులన్నీ ఎవరు చెప్పారు? తనే చేతులారా ఇంతవరకూ తెచ్చింది! పిల్లాడి కింతవరకూ రావటానిక్కారణం తనే! తనుండగా అబ్బాయి బతికి బయట పడతాడా? యేమో!

ఇహ సహించలేకపోయింది విశాలాక్షి. ఇంతవరకూ అణిచిపెట్టుకున్న దుఃఖం పొర్లిపోయి వెల్లువలై ప్రవహించసాగింది. కళ్లు రెండుచేతుల్తోనూ మూసుకుని బిగ్గరగా ఏడవటం మొదలెట్టింది.

'ఏమిటా యేడుపు? అంతా అయిపోయిం తర్వాత ఇప్పు డేడిస్తే యేం లాభం? పైగా పిల్లవాడు భయపడి పోతాడు. వూరుకో'

చప్పున కళ్లు తుడుచుకొని వూరుకుంది.

'వా ళ్లీపాటికి వస్తూంటారా?' అనడిగింది భర్తని యెలాగో.

'వున్నపాటుగా బయల్దేరి రమ్మని టెలిగ్రాం యిచ్చాను. వెంటనే బయల్దేరితే ఈపాటికో ఇంకాసేపటికో రావలసుంటుందిమరి'

'నేను రాను—నేను రాను—అమ్మని చూసొస్తా—అమ్మోయ్' అని కేకపెట్టి మంచంమీదినించి కింద పడబోయాడు పిల్లవాడు. గట్టిగా పట్టుకున్నాడు శ్రీధరరావు.

విశాలాక్షికూడా పిల్లవాడిదగ్గిరికి పోబోయింది కాని, తను దగ్గిరికి వెడితే, ఎప్పుడో పోవలసిన ప్రాణం వెంటనే పోతుందేమో నని వెళ్ళలేదు. ఇంతలో వాకిట్లో బండి ఆగిన చప్పుడు. రాఘవరావూ, సుభద్రమ్మా బండిలోంచి దిగారు. సుభద్రమ్మ కళ్ళన్నీ వాచివున్నై.

సుభద్రమ్మ రాగానే ఏమీ మాట్లాడకుండా సరాసరి అబ్బాయిపడుకున్న మంచందగ్గిరికి వెళ్ళి పిల్లవాడిమీద చెయ్యేసింది. అబ్బాయి వులిక్కిపడి, 'అమ్మ కావాలి—అమ్మకావాలి' అని కలవరించాడు.

'అమ్మే ఒచ్చింది నాయినా! చూడు, అమ్మా, నాన్నా ఒచ్చారు అరుగో'అని శ్రీధరరావు సుభద్రమ్మనీ, రాఘవరావునీ చూపెంచాడు.

పిల్లవాడు ఒక్క క్షణం సుభద్రమ్మవైపు చూసి, 'అమ్మా'అంటూ కంఠానికి రెండుచేతులూ పెనవేశాడు, చెట్టుకొమ్మకి అంటిపెట్టుకున్న గాలికి అల్లలాడే తీగకి మల్లే.

అబ్బాయిని అట్లాగే పట్టుకుని సుభద్రమ్మ కన్నీళ్లు కారుస్తోంది. ఆదృశ్యాన్ని చూస్తున్న విశాలాక్షికి మరో లోకంలోకి తేలిపోతున్నట్లనిపించింది. ఆ దృశ్యం పూర్తిగా హృదయంలో హత్తుకుపోయింది.

౭

అబ్బాయికి సుభద్రమ్మ కనపట్టం యేమిటి, జ్వరం జారిపోవటమేమిటి—రెండూ ఒక్కసారే జరిగిపోయినై. మర్నాడు మామూలుగా మాట్లాట్టం, మూడోనాటి కల్లా లేచితిరగటం మొదలెట్టేసరికి అందరి మనస్సులూ కుదుటపడ్డయ్.

డాక్టరు వచ్చి ఒకసారి చూసి, 'ఇహ నా అవసర మేమీ లేదు'అని వెళ్లిపోయాడు.

'అమ్మా! అమ్మా! ఇహెప్పుడూ నన్నొదిలి పెట్టి వెళ్లవుకదూ!' అని కొంగుపట్టుకుని విడిచిపెట్టకుండా సుభద్రమ్మవెంటే తిరగటం మొదలెట్టాడు పిల్లవాడు.

రాఘవరావుకు సెలవైపోయింది. ఆరోజు బయల్దేరివెళ్ళకపోతే వుద్యోగానికి నీళ్లొదులుకోవాలి. తీరా వెడితే అబ్బాయి మళ్లీ మంచంలోపడి, తిరిగీ బయట పడతాడన్న నమ్మకం లేదు. ఇదో పెద్దసమస్య అయి కూర్చుంది అందరికీ!

'అబ్బాయిని కొన్నాళ్లదాకా మాదగ్గిరే వుంచుకుంటాం. ఇప్పుడే ఒదిలిపెట్టివెడితే చాలాప్రమాదం'అని ఓనాడు సుభద్రమ్మ విశాలాక్షితో అంటే, విశాలాక్షికి మనస్సు చివుక్కుమంది. తన సొత్తు, తన రక్తమాంసాలు ఎవరో లాక్కుడుతున్నట్టనిపించిం దామెకు. మరి కర్తవ్యం?

'నామాట విని మీరుకూడా మావూరే బదిలీ చేయించుకోండి. చక్కగా అంతా అబ్బాయిని చూస్తూండొచ్చు' అన్నది సుభద్రమ్మ. కొంచెం సంతోషం కలిగింది విశాలాక్షికి.

ఆ సాయంకాలమే రాఘవరావూ, సుభద్రమ్మా బయల్దేరివెళ్ళిపోయే రోజు. పిల్లవాడు ఆరోజల్లా సుభద్రమ్మచెంగుపట్టుకుని 'అమ్మా అమ్మా'అంటూ విడవనే లేదు! ఇహ తప్పనిసరిగా పిల్లవాణ్ణి పంపవలసొచ్చింది.

అంతా బండెక్కబోయే సమయానికి విశాలాక్షి దుఃఖం పట్టలేకపోయింది. పిల్లవాణ్ణి గట్టిగా కావలించుకుని—

'ఎక్కడికి కడతావు నాన్నా! నేను మీఅమ్మని కాదూ'అని కళ్ళవెంట బొటబొటా నీళ్లు పడుతుండగా అడిగింది.

'కాదు, నువ్వు మాఅమ్మవికాదు, దెయ్యానివి. నేనిక్కడుండను. మాఅమ్మదగ్గిరికే పోతా'అని యేడుపు సాగించాడు పిల్లవాడు.

పిల్లవాణ్ని ఒదిలిపెట్టేసి లోపలి కెళ్లిపోయింది విశాలాక్షి.

శ్రీధరరావు వారిని సాగనంపి ఒచ్చిచూస్తే విశాలాక్షి దిండుమీద పడుకుని వెక్కివెక్కి యేడుస్తోంది.

'చేతులారా చేసుకుని ఇప్పు డేడుస్తావేం? చేసుకున్నంతా అనుభవించొద్దూ? నీ వుద్యోగం, స్వయం పోషకత్వమే ఆలోచించావుగాని, ఒక్కసారయినా పిల్లవాణ్ని దగ్గిరికితీసిన పాపాన పోయినావూ? వాడు మనకు పుట్టనేలేదని అనుకుని గుండె రాయిచేసుకో.' అంటూ వెళ్లిపోయినాడు.

మర్నాడు శ్రీధరరావు ఆఫీసునించి ఒచ్చేసరికి విశాలాక్షి అతని దగ్గిరికి వెళ్లి మెల్లగా కాలరు సర్దుతూ-

'మీరు ఆవూరే బదిలీచేయించుకోండి' అన్నది.

'మరి నీ వుద్యోగం?'

'రాజీనామా ఇవ్వాళే అందజేశాను' అన్నది విశాలాక్షి.